క్లుప్తంగా

జాన్‌వెస్లీకి పార్టీ శ్రేణుల శుభాకాంక్షలు



జాన్‌వెస్లీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

యాచారం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జాన్‌వెస్లీకి పార్టీ మండల శ్రేణులు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య, కేవీపీఎస్ మండల నాయకులు కావలి జగన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: మండల పరిధి అందుగుల గ్రామం నుంచి పల్లెతండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు మంజూరు చేయడంతో కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివద్ధి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్, సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: మండల పరిధి పెద్దావేములోని బావి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాతకు వినతి పత్రం అందజేశారు. వెంచర్ ఏర్పాటులో భాగంగా గ్రామానికి కేటాయించిన 10శాతం భూమిని, నిర్వాహకులు ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఎంపీడీఓ.. వెంచర్‌ను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో దేపావత్ పత్య, రవి, వినోద్, అఖిల్, సికిందర్, ఆదేశ్, అరుణ్, హరి, రవిందర్, వినయ్, రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'లక్ష డప్పులు' జయప్రదం చేయండి

యాచారం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. బుధవారం మండల పరిధి నందివనపర్తి గ్రామంలో సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు మూలి వెంకటయ్య ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కుర్మ, యాదవ, ముస్లిం తదితర కులమత పెద్దలు ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. మాదిగ, మాదిగ ఉపకులాలు చేస్తున్న రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం న్యాయమైనదేనని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జంగయ్య, శ్రీకాంత్, మహేశ్, ముత్యాలు, సుధాకర్, జంగయ్య, వెంకటరమణ, రాందాస్, బుగ్గరాములు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కడ్తాల్: డిసెంబర్ 31 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు, ఇదీ వరకు పట్టాదారు పాసుపుస్తకం ఉండి, రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని వారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం నింపి, దానికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను జతపరిచి వ్యవసాయ శాఖ కార్యాలయం లేదా రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ నెల 31లోగా అందజేయాలని సూచించారు.

రైతు 'భరోసా' ఏది?



- ఆందోళన చెందుతున్న అర్హులు
- పాసుపుస్తకాలతో.. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ప్రకటించి 48 గంటలు గడవక ముందే అర్హులైన రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మాకు రాలేదంటే, మాకు రాలేదంటూ పేర్కొంటున్నారు. జాబితాలో పేరుంది.. కానీ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం.. మండల పరిధి గ్రామాల్లో 33,941.11 ఎకరాలు సాగు భూమి ఉంది. అందులో 28,909.29 ఎకరాలు మాత్రమే సాగు అవుతోంది. 5,031.22 ఎకరాల్లో ఎలాంటి పంటలు వేయలేదు.

లింగంపల్లి రైతులకేనా భరోసా?

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద సాగు భూమికి ఎకరాకు రూ.6వేల చొప్పున యాసంగి, వానాకాలం పంటలను కలుపుకొని ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అందులో భాగంగా గణతంత్ర దినోత్సవాన నిర్వహించిన గ్రామసభల్లో మండలానికి ఒక్కో గ్రామంలో భరోసా పథకం కింద డబ్బులు పంపిణీ చేసింది. మంచాల మండల పరిధి లింగంపల్లిలో 380 మందికి రైతులకు భరోసా డబ్బులు చెల్లించింది. ఇంకా 22 గ్రామాల్లో పథకం కోసం రైతులు పాసు బుక్కులు పట్టుకుని బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక లింగంపల్లి గ్రామానికే రైతు భరోసా ఇస్తారా అంటూ సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. మాకు త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.

త్వరగా ఇవ్వాలి



అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి. జాబితా ప్రకారం త్వరగా వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి. గ్రామసభల్లో లింగంపల్లి గ్రామ రైతులకు మాత్రమే ఇచ్చారు. మాకు, ఇతర గ్రామాల రైతులకు చెల్లించలేదు.

– ఓరిగంటి శ్రీను, రైతు, మంచాల

31వ తేది వరకు వస్తుంది



రైతు భరోసా పథకం అర్హులందరికీ వస్తుంది. ఈ నెల 31వ తేదీలోపు అన్ని గ్రామాల రైతులకు పథకం అందుతుంది. ఎవరూ కూడా ఆందోళన చెందవద్దు. గుట్టలు, రాళ్లతో కూడిన భూములు, లేఅవుట్లకు రాదు.

– హన్మంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, మంచాల

విడతల వారీగా..

విడతల వారీగా అర్హులైన రైతులందరికీ భరోసా పథకం వస్తుంది. దశల వారీగా, మొదట ఒక ఎకరం పొలం, తరువాత రెండు ఎకరాల చొప్పున ఇలా అందరికీ డబ్బులు వస్తాయి. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతుల వివరాలను కంప్యూటరీకరణ చేసి, అర్హులందరికీ వర్తింపచేస్తాం.

– కృష్ణ మోహన్, వ్యవసాయ అధికారి, మంచాల

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



హనుమాన్ దేవాలయం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజుల పాటు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 30న మహాగణపతి లక్ష్మీపూజ, అఖండ దీపారాధన, గోపూజ, రక్షాబంధనం, సాయంత్రం మండప దేవత పూజలు, అగ్నిప్రతిష్ఠ, మహామంగళ హారతి నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్‌గౌడ్‌లు తెలిపారు. 31న పూజలు, మండప దేవతార్చన, యంత్ర ప్రతిష్ఠ, ఆంజనేయస్వామి, రేణుక ఎల్లమ్మ, మైసమ్మతల్లి, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, శాంతిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే రోజున ఆలయం ఎదుట సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

గీత కార్మికులకు రక్షణ కవచం



కిట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ బద్యనాథ్

ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

కడ్తాల్: కల్లుగీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కవచం' సేఫ్టీ మోకులను అందజేస్తుందని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు. మండల పరిధి ముద్విన్‌తో పాటు, మాడ్గుల మండల పరిధి మాడ్గుల, ఇర్విన్ గ్రామాల్లో మూడు రోజులుగా గీత కార్మికులకు బీసీ సంక్షేమ శాఖ- ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా సేఫ్టీ మోకు ఉపయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, కార్మికులు తాటి చెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. చిన్న తేడా వచ్చినా ప్రాణాలకు ముప్పు ఏర్పడటమో, అంగవైకల్యం బారిన పడటమో జరుగుతుంటాయని పేర్కొన్నారు. వారి జాగ్రత్త కోసమే సేఫ్టీ కిట్లను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. విడతల వారీగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు 280 కిట్లు మంజూరయ్యాయని, టీఎఫ్‌టీ లైసెన్స్ ఉండటంతో పాటు, టాడీ కో-ఆపరేటివ్ సొసైటీస్(టీసీఎస్) సభ్యత్వం కలిగిన వారికి కిట్లను ఇస్తున్నామని సీఐ వెల్లడించారు. ఈ కిట్లు ఎంతో రక్షణగా ఉంటాయని, కార్మికులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమలో ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, శిక్షణ నిపుణులు సిబ్బంది శంకర్, బాబు, బాలస్వామి, గీత కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి గ్రీన్ ఫీల్డ్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, గైరాన్‌కోట, ఎంఎన్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మర్రిగూడ, రాగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పీఆర్ హోమ్స్, ఇంద్రానగర్, జన్నారం, ఆదిబట్ల మెయిన్‌రోడ్, ఆయుధాల గడ్డలో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వైకేఆర్, జయసూర్య పట్నం, సీబీ ఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేడ్కర్ నగర్, మారుతి నగర్, టెంపుల్ టౌన్, చిల్కూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్ ఫేజ్ 1,2, శ్రీరామ ఎన్‌క్లేవ్- 4, ఆదిబట్ల శివాలయం, నాదర్‌గుల్ గ్రామం, అయోధ్య నగర్, నాదర్‌గుల్ బస్టాండ్, శాంతి నగర్, ధరణి ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్ కాలనీ, బాలాజీ హోమ్స్, మారుతి ఎన్‌క్లేవ్‌లో సరఫరా ఉండదని ఏఈ వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మండల విద్యాధికారి కస్నా నాయక్



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ

మహేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి కస్నానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం గడికోట మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. పోటీల్లో 14 పాఠశాలలు పాల్గొన్నాయి. కబడ్డీ పోటీల్లో వివేకానంద హైస్కూల్, ఖోఖోలో మొదటి బహుమతి శ్రీరామచంద్రస్కూల్, బాలికల ఖోఖోలో మొదటి బహుమతి టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కందాడి శ్రీరామ్, ఏబీవీపీ మహేశ్వరం నగర అధ్యక్షుడు శ్రీనివాస్, నగర కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

నేడు పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఆమనగల్లు: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఈ నెల 30న జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వీరబొమ్మ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

ఆమనగల్లు: ఉర్సు ఉత్సవాలను బుధవారం ముస్లిం మత పెద్దలు అబ్దుల్ నయీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లి మండల పరిధి వెల్జాల గ్రామంలోని దర్గా వద్ద ఉత్సవంలో భాగంగా ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతిహా సమర్పించారు. మత పెద్దలు అబ్దుల్ ఖలీం, అబ్దుల్ రహీం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్‌ను ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వహీద్ అలీ, రెహ్మాన్, ఫరూక్, ఖాజామొయినొద్దీన్ పాల్గొన్నారు.

నూతన నియామకం

యాచారం: మండల పరిధి గునుగల్ గ్రామానికి చెందిన మచ్చ అనిల్‌కుమార్ మల్‌రెడ్డి రంగారెడ్డి యువసేన(ఎంఆర్ఆర్) మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసేవే లక్ష్యంగా ఎంఆర్ఆర్ టీం కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్‌లో ఫిబ్రవరి 3న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొత్రమల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కంటి సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి కోరారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూస్తానని ఆమె వారికి ఈ సందర్భంగా హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల శేఖర్, నర్సింహ, యాదయ్య, సత్తయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రైతును రాజును చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా రైతుభరోసా ఎకరాకు రూ.6 వేలతో పాటు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ, ఉపాధి కూలీలకు, రూ.6 వేలు విడుదల చేసిన సందర్భంగా.. బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఇదీ రైతు సంక్షేమ ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బాలరాజు, రాజేశ్, షాబుద్దీన్, ఇమ్రాన్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్, బ్రహ్మచారి, చందోజీ, సత్యం, లక్పతినాయక్, లక్ష్మణ్ నాయక్, పర్వతాలు, బిక్షపతి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీచర్‌ను నియమించాలి



పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధి బాలాజీనగర్ పాఠశాలను వారు సందర్శించి మాట్లాడారు. బడిలో మూడు రోజులుగా ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటూ.. అక్కడే చిన్నారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు రాకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన విద్యార్థుల పట్ల చిన్న చూపు తగదని, వెంటనే సంబంధిత అధికారులు సమస్యపై దృష్టి సారించి, టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యాశాఖ మండల కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం గౌడ్, మాన్యనాయక్, రాందాస్‌నాయక్, కల్యాణ్‌నాయక్, భాస్కర్ నాయక్ ఉన్నారు.

గద్దర్‌పై 'బండి' వ్యాఖ్యలు అభ్యంతరకరం



ఆమనగల్లు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి
- గద్దరన్న విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యుల డిమాండ్

ఆమనగల్లు: బాధ్యతగల పదవిలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గద్దరన్న విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆయను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరారు. బండి వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. సంజయ్‌కు వ్యతిరేకంగా నినదించారు. నిరసనలో విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ లక్ష్మణశర్మ, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జేఏసీ కన్వీనర్ శివలింగం, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు రజిత, సాత్రి నర్సింహ, కేశమల్ల భిక్షపతి, సుధాకర్, శేఖర్, శ్రీను, యాదయ్య, మాజీ సర్పంచ్‌లు శంకర్, పుల్లయ్య, యాదయ్య, సురేష్, శ్రీను, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ దిష్టిబొమ్మ దహనం

యాచారం: గద్దర్‌పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం సాగర్‌రోడ్డు అంబేడ్కర్ కూడలిలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందులో మాల మహానాడు తెలంగాణ అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు కృష్ణ, బండి మహేశ్, భర్తకి జగన్, ధన్‌రాజ్, రవి, మల్లేశ్ కుమార్, హనుమల్ల కృష్ణ, కృష్ణమూర్తి, గొరేటి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచాల: బడుగు, బలహీన వర్గాల కోసం పని చేసే ప్రభుత్వం మాది అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్నంలోని క్యాంప్ కార్యాలయంలో మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.11లక్షల 71 వెయ్యి 500ల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నాడు, నేడు కాంగ్రెస్ సర్కార్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిందని, చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు రమాకాంత్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, పాండు, లింగంగౌడ్, గణేశ్, వెంకటేశ్, సత్తయ్య, బాలునాయక్, రాజు గౌడ్, రామదాస్, బుగ్గరాములు, సతీష్, రాజేష్, విక్రమ్, పగడాల శ్రీను, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనల్ని మనమే రక్షించుకోవాలి



రోడ్డు భద్రత మాసోత్సవాల్లో మాట్లాడుతున్న మాజీ చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, మనల్ని మనమే రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. యువకులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మంగ, కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, సహాయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనూష, రాఘవేందర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి రాకేష్‌భవాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరం: భవన నిర్మాణ రంగంలో వలస కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసి మోసం చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వలస కార్మికులను బడా కార్పొరేట్ కంపెనీలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించకుండా పని చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే వాటిని మార్చాలని కోరారు. ఇందులో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.